ప్రజాశక్తి
గురువారం 26 సెప్టెంబర్ 2024 5 అనంతపురం





రైతులతో కలిసి కలెక్టరేట్ వద్దకు ప్రదర్శనగా వెళ్తున్న రైతుసంఘం నాయకులు

రైతు సంక్షేమ పథకాలు అమలు చేయండి

◆ఏపి రైతుసంఘం ◆కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రైతు సంక్షేమానికి ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. 2023 ఖరీఫ్ రబీ ఇన్సూరెన్స్, పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలని, వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దనే తదితర డిమాండ్ల పరిష్కారం కోరుతూ రైతుసంఘం ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్ వద్ద బుధవారం నాడు ధర్నా నిర్వహించారు. ముందుగా రైతులంతా కలిసి నగరంలోని సంగమేష్ సర్కిల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాలరంగయ్య మాట్లాడుతూ రైతులకు పంట పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు హామీ ఇచ్చారన్నారు. ప్రస్తుతం రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నేపథ్యంలో వెంటనే పెట్టుబడి సాయం అందించాలని కోరారు. 2023 ఖరీఫ్, రబీలో జరిగిన అన్ని పంటల నష్టానికి వెంటనే నష్టపరిహారం ప్రకటించి రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఒత్తిడితో గత ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెట్టేందుకు తెచ్చిన జీవో 22ను రద్దు చేయాలన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి ప్రతి ఎకరాకూ సాగునీరు ఇవ్వాలన్నారు. టమోటా మార్కెట్ ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. అన్ని రకాల ఎరువులు, పురుగు మందులు రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా రైతులకు సబ్సిడీతో అందించాలని కోరారు. ప్రభుత్వం దసరాలోపు ఇన్సూరెన్స్ ప్రకటించకపోతే చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, విరుపాక్షి, రాజారామ్ రెడ్డి, చెన్నారెడ్డి, నల్లప్ప, ఎంకె.వెంకట్ రెడ్డి, పోతులయ్య, కుళ్లాయప్ప, మల్లికార్జున, రెడ్డిపల్లి శ్రీనివాసులుతో రైతులు పాల్గొన్నారు.

అనంత వైపరీత్యం..!



వర్షాలు రావడంలో రాష్ట్రమంతా ఒక ఎత్తైతే అనంతపురం జిల్లా ఒక ఎత్తు అన్నట్టుగా ఉంది. వర్షాలు అంతటా వస్తే ఇక్కడ మాత్రం సెప్టెంబర్‌లో వర్షాభావం నెలకొంది. అది కూడా ఒక నెల బాగా వస్తే మరో నెల తీవ్ర వర్షాభావం నెలకొంది. రెండేళ్లలో కురిసిన వర్షపాతం చూస్తే గతేడాది జూన్, ఆగస్టు నెలల్లో వర్షాభావం నెలకొంటే... ఈ ఏడాది జులై, సెప్టెంబర్ మాసాల్లో వర్షాభావం నెలకొంది. ఈ ఏడాది మంచి వర్షాలు పడినట్టుగా కనిపిస్తున్నా, పంటలకు కీలకమైన జులై, సెప్టెంబర్ మాసాల్లో వర్షాభావం నెలకొంది. ఈ ప్రభావం పంటల సాగుపైనే కాకుండా వేసిన పంటలపైనా పడుతుండటం గమనార్హం.

◆ గతేడాది జూన్, ఆగస్టు ఈ ఏడాది జులై, సెప్టెంబర్...
◆ ఆగస్టులో దంచికొట్టింది.. సెప్టెంబర్‌లో వర్షాభావం

	సాధారణం	నమోదు	శాతం	సాధారణం	నమోదు	
జూన్	61	45.8	-24.9	61.0	147.7	142.1
జులై	63.9	24.4	-61.8	63.9	24.4	-61
ఆగస్టు	83.8	13.7	-83.7	83.8	210.8	151.6
సెప్టెంబర్	110.9	14.6	3.3	71.8	34.8	-51.6
	319.6	247.4	-22.6	280.5	417.7	48.9

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గతేడాది అంటే 2023-24 సంవత్సరంలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 60 మిల్లీమీటర్లు అయితే 45.8 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. సాధారణం కంటే 24.9 శాతం తక్కువ వర్షపాతం నమోదయింది. అదే సంవత్సరం ఆగస్టులో 83.8 మిల్లీమీటర్లు అయితే 13.7 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. సాధారణం కంటే 83.7 శాతం తక్కువ పడింది. మొత్తంగా ఆ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షపాతం 319.4 మిల్లీమీటర్లు అయితే 247.4 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 22 శాతం తక్కువ పడింది. ఈ ఏడాది అంటే 2024-25 సంవత్సరంలో జూన్‌లో సాధారణం కంటే ఎక్కువ పడింది. జులై నెలలో చూస్తే సాధారణ వర్షపాతం 63.9 మిల్లీమీటర్లు అయితే 24.4మిల్లీమీటర్లు మాత్రమే పడింది. సాధారణం కంటే 61.8 శాతం తక్కువ పడింది. ఇక ఆగస్టులో చూస్తే సాధారణ వర్షపాతం 83.8 మిల్లీమీటర్లు అయితే ఏకంగా 210.8 మిల్లీమీటర్లు పడింది. సాధారణం కంటే 151.6 శాతం అధికంగా పడింది. ఇక సెప్టెంబర్‌లో నెలలో సాధారణ వర్షపాతం 71.3 మిల్లీమీటర్లు అయితే కేవలం 34.8 మిల్లీమీటర్లు మాత్రమే పడింది. సాధారణం కంటే 51.6 శాతం లోటుంది. ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు చూస్తే సాధారణ వర్షపాతం 280 మిల్లీమీటర్లు కాగానూ 417 మిల్లీమీటర్లు నమోదయింది.

గుత్తి మినహా అంతటా వర్షాభావమే

అనంతపురం జిల్లాలో 31 మండలాలుంటే గుత్తి మండలం మినహా తక్కిన అన్ని మండలాల్లోనూ వర్షాభావమే నెలకొంది. గుత్తిలో ఆదివారం రాత్రి ఒక్క రోజే 93 మిల్లీమీటర్లు నమోదయింది. తక్కిన అన్ని మండలాల్లోనూ సాధారణం కంటే సగటున 50 శాతం కంటే తక్కువ వర్షపాతం నమోదయింది.

పంటలపై తీవ్ర ప్రభావం

ఒక నెల ఎక్కువ... ఒక నెల తక్కువ వర్షాల ప్రభావం పంటలపై పడుతోంది. అనంతపురం జిల్లాలో 3,54,183 హెక్టార్ల సాధారణ సాగుభూమి కాగా 2,83,782 హెక్టార్లలో సాగైంది. సాధారణం కంటే 82 శాతం సాగైంది. ప్రధాన పంట వేరుశనగ 1,22,130 హెక్టార్ల సాధారణ సాగుకాగా 96,762 హెక్టార్లలో సాగైంది. వాతావరణ పరిస్థితుల ప్రభావం దిగుబడులపై పడనుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎండుతున్న వేరుశనగ పంట

వానలొస్తానే దిగుబడులు

మూడు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. సుమారు ఒకటిన్నర లక్ష రూపాయల వరకు పెట్టుబడులు పెట్టాను. వాతావరణ ప్రభావంతో దిగుబడులు ఏమోస్తాయోనన్న దిగులు మొదలైంది. ఆగస్టులో మంచి వర్షాలొస్తే, సెప్టెంబర్‌లో చినుకుజాడ లేదు. మరో వారం రోజులు వర్షం లేకపోతే పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఉంది.

కొండయ్య, మన్నీల గ్రామం, అనంతపురం రూరల్.

బఫర్ పేరుతో రేషన్‌లో కోత

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

శింగనమల నియోజకవర్గం వ్యాప్తంగా బఫర్ పేరుతో రేషన్ బియ్యం ఇవ్వకుండా కార్డుదారులను మోసం చేస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఓ.నల్లప్ప విమర్శించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ శింగనమల నియోజకవర్గ మొత్తంగా ఈ నెల 12,160 మంది కార్డుదారులకు రేషన్ ఇవ్వనట్లు తెలుస్తోందన్నారు. దాదాపు అన్ని మండలాల్లోనూ పంపిణీ సక్రమంగా జరగలేదన్నారు. పుట్లూరు మండలంలోని షాపు నంబర్ 1228004లో 253 కార్డులు ఉంటే 124 మందికి మాత్రమే పంపిణీ జరిగిందన్నారు. బుక్కరాయసముద్రంలో 30 నుంచి 40 శాతం మందికి బియ్యం వేయలేదన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా డీలర్లు బఫర్ పేరుతో భారీగా దోచుకుంటున్నా సివిల్ సప్లై అధికారులు స్పందించకపోవడం దారుణం అన్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్పందించి బఫర్ పేరుతో దోచుకున్న బియ్యాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో దోపిడీని అరికట్టాలంటే నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీలతో ఆహార సలహా సంఘం ఏర్పాటు చేయాలని కోరారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీకృష్ణదేవరాయ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న టైం స్కేల్, మినిమం వేజ్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 30వ తేదీన చేపట్టిన చలో కలెక్టరేట్ కరపత్రాలను నాన్ టీచింగ్ ఉద్యోగుల కార్యాలయం వద్ద బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖల్లో టైం స్కేల్, మినిమం వేజ్, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఆప్కాస్ తదితర కాంట్రాక్టు విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు అందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు ఇవ్వాలన్నారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ సెలవులు మంజూరు చేయాలన్నారు. ఈ సమస్యల పరిష్కారంపై 30న చేపట్టిన చలో కలెక్టరేట్‌లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి టి.గోపాల్, జిల్లా ఉపాధ్యక్షులు మన్నెల రామాంజనేయులు, మినిమం వేజ్, టైం స్కేల్, అవుట్‌సోర్సింగ్, ఉద్యోగులు సంజీవులు, ఎల్లప్ప నారాయణప్ప, ఎస్కెయు టైం స్కేల్ ఉద్యోగుల అధ్యక్షులు చంద్రశేఖర్ నాయుడు శివయ్య సంజీవప్ప, హాస్టల్ ఉద్యోగులు అధ్యక్షులు శివయ్య, సూర్యనారాయణ, జెఎన్‌టియు టైంస్కేల్ ఉద్యోగుల సంఘం నాయకులు రామానుజన్ రెడ్డి, హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రమేష్, హరి పాల్గొన్నారు.



చలో కలెక్టరేట్ కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

పూర్తి స్థాయిలో పిఎం శ్రీ అమలు చేద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో పిఎం శ్రీ అమలును పూర్తి స్థాయిలో చేసేలా చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పిఎం శ్రీ (పిఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకంపై సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎం శ్రీ అమలులో దేశంలోని 700 జిల్లాలతో అనంత జిల్లా పోటీపడాలన్నారు. జిల్లాలో 1,741 పాఠశాలలుండగా, అందులో పిఎంశ్రీ కింద 42 పాఠశాలలను గుర్తించినట్లు చెప్పారు. అన్ని పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, బాలికల మరుగుదొడ్లు, శానిటరీ ప్యాడ్స్, ఫర్నిచర్, సైన్స్ ల్యాబ్, ఫిజికల్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్ ఏర్పాటు, ఇంటర్నెట్ సౌకర్యం, కంప్యూటర్ ల్యాబ్, ఐసిటి ల్యాబ్, స్మార్ట్ క్లాస్ రూమ్స్, లైబ్రరీ, అటల్ టింకరింగ్ ల్యాబ్, స్కిల్ ల్యాబ్, స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఏర్పాటు లాంటి 21 రకాల వసతులను తప్పనిసరిగా కల్పించాలన్నారు. వీటి కోసం విద్యాశాఖ అధికారులతో పాటు అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజు, డీఈవో వరలక్ష్మి, డ్వామా పీడీ విజయలక్ష్మి, డిసిఒ మురళీకష్ణ, డివిఈవో వెంకటరమణ నాయక్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్ కుమార్, అడిషనల్ డిఎంహెచ్ఒ డా॥సుజాత, ఎపిఎస్ఎస్‌డిసి డిఎస్‌డిఒ ప్రతాప్ రెడ్డి, ఏపీ బీసీడబ్ల్యూ రెసిడెన్షియల్ స్కూల్స్ కన్వీనర్ ప్రిన్సిపల్ సంగీత కుమారితో ఆపటు అన్ని మండలాల ఎంఈఓ -2లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్



కియా ప్రతినిధులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి విసి సుదర్శనరావు

కియా ప్రతినిధులతో జెఎన్‌టియు విసి భేటీ

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శన్ రావు కియా కార్ల కంపెనీ ప్రతినిధులతో వర్సిటీ పరిపాలన భవనంలో బుధవారం నాడు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి విసి మాట్లాడుతూ జెఎన్‌టియు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా సహకరించాలని కియా ప్రతినిధులను కోరారు. కియా పరిశ్రమను సందర్శించడానికి అధ్యాపకులు, విద్యార్థులకు అవకాశం కల్పించాలన్నారు. అనంతరం కియా బందం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల, వివిధ విభాగాల ల్యాబ్‌లను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీమెన్స్ ల్యాబ్స్ పరిశీలనలో వాటి గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కియా ప్రతినిధులు హాంగ్‌సంగ్ పార్క్, హాంగ్ కిమ్, హన్, ఓఎస్‌డి ఎన్.దేవన్న, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ప్లేస్ మెంట్ డైరెక్టర్ ఎన్.విశాలి, ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, ఉమా శంకర్ పట్నాయక్, రమేష్ బాబు, ఎంఎస్.విజయ పాయ్, అకాడమిక్ డైరెక్టర్ కోఆర్డినేటర్ డా॥అరుణ మస్తాని, వివిధ విభాగాల అధిపతులు డా॥కళ్యాణి రాధ, డా॥ఎం.రామ శేఖరరెడ్డి, ప్లేస్ మెంట్ కోఆర్డినేటర్ జె. శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి రూ.లక్ష అందజేత



మృతుని భార్యకు చెక్కును అందిస్తున్న జెసి

పామిడి : కలెక్టరేట్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న రైతు సూర్యనారాయణ కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.లక్ష సాయాన్ని అందించారు. బుధవారం నాడు బాధిత కుటుంబ సభ్యులను జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ పామిడి పట్టణంలో పరామర్శించారు. అనంతరం తహాశీల్దార్ కార్యాలయంలో కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల చెక్కును అందించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతు కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. కుటుంబ విభేదాల కారణంగా ఇబ్బందుల్లో ఉన్న భూమి సమస్యను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వసంతబాబు, పామిడి తహాశీల్దార్ శ్రీధర్ మూర్తి పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు


పద్మశాలి వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు

ప్రజాశక్తి-అనంతపురం అర్బన్

తెలుగుదేశం పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకూ న్యాయం జరుగుతుందని, దానికి ఉదాహరణ తానేనని పోతుల లక్ష్మీ నరసింహులు అన్నారు. పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించిన నేపథ్యంలో ఆయన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పోతుల లక్ష్మీ నరసింహులు మాట్లాడుతూ ఎమ్మెల్యే దగ్గుపాటి చొరవతోనే తనకు పదవి వచ్చిందన్నారు. పార్టీలో కష్టపడి పని చేస్తున్న తనను గుర్తించి పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లాలో పద్మశాలీయుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు జింక సూర్యనారాయణ, కుంచెపు వెంకటేష్, వెంకటరాముడు, మంజు నాథ్, కుల్వంత్ స్వరూప్, రాజేశ్వరి, వడ్ల భావన, మంజుల నారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో ఐదేళ్ల అభివృద్ధికి పునాదులు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం 100 రోజుల్లో ఐదేళ్లకు కావాల్సిన అభివృద్ధి పనులకు బాటలు వేశారని ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ తెలిపారు. బుధవారం నాడు నగరంలోని 1వ డివిజన్ ఎర్రనేల కొట్టాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చంద్రబాబు పాలన సాగుతోందన్నారు. ప్రజలందరికీ మేలు జరిగేలా భవిష్యత్తులోనూ చంద్రబాబు పాలన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజతో పాటు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే దగ్గుపాటికి కృతజ్ఞతలు తెలుపుతున్న పద్మశాలి వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



సీమంతం చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

ప్రజాశక్తి-యల్లనూరు

కూటమి ప్రభుత్వం ఏర్పటై 100 రోజుల్లో అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించేలా పాలన సాగుతోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని నీరజాంపల్లి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీరజాంపల్లి గ్రామంలో సిసి రోడ్లు వేయిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.5 లక్షలు మంజూరు చేశామన్నారు. తాగు నీటి, విద్యుత్ సమస్యలనూ పరిష్కరిస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ గ్రామాన్ని మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దత్తత తీసుకున్నా చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా చిన్నారికి అన్నప్రాసన, మహిళకు సీమంతం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి రఘూనాథ్ రెడ్డి, తహాశీల్దార్ నాగరాజు, ఎంపిడిఒ వీరరాజు, ఈవోఆర్డీ విజయశేఖర్ నాయుడు, ఏపీవో షబ్బీర్, ఎపిఎం ముత్యాలప్ప, ఐసిడిఎస్ సూపర్ వైజర్ రాజమణి, టిడిపి మండల కన్వీనర్ రామాంజనేయులు, శ్రీనివాసుల రెడ్డి, రమణారెడ్డి, కొత్తమిద్దె వెంకటరమణ, దొడ్లో సుబ్బరాయుడు, మోహన్ నాయుడు, జనార్దన్ రెడ్డి, సర్పంచి గోపాల్, నారాయణ స్వామి, అశోక్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని జూనియర్ కళాశాల నుంచి ర్యాలీ గా తహశీల్దార్ కార్యాలయం చేరుకుని అక్కడ ఆందోళన చేపట్టారు. విద్యార్థులు మధ్యాహ్నం బయట హోటళ్లలో భోజనం చేయాలంటే రూ. వంద ఖర్చు చేయాల్సి ఉందని, స్తోమత లేని వాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం పథకం అమలు కోరారు. అనంతరం తహాశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పి.భాస్కర్, భీమేష్, భాస్కర్, రామాంజనేయులు, చిరంజీవి, స్వర్ణసాగర్, ఠాగూర్, వంశీ, కిషోర్, ఆనంద్, కిరణ్‌కుమార్, చరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



తహాశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

రైతు సూర్యనారాయణ కుటుంబానికి
రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పట్టాదారు పాసుపుస్తకం విషయంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మనస్తాపంతో కలెక్టరేట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న రైతు సూర్యనారాయణ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద రైతు సూర్యనారాయణ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సూర్యనారాయణ మృతికి రెవెన్యూ అధికారులే కారణం అన్నారు. పట్టాదారుపాసు పుస్తకం సమస్యను పరిష్కరించకుండా బూదేడు విఆర్ఒ మధు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. ఆయన్ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతు కుటుంబానికి 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి న్యాయం చేయాలన్నారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

ప్రజాశక్తి -అనంతపురం

సస్యరక్షణ చర్యలు తీసుకుంటే వేరుశనగ, కంది పంటలకు సోకే తెగుళ్లను నివారించవచ్చని అనంతపురం మండల వ్యవసాయ అధికారి జె.శశికళ తెలిపారు. మన్నీల, ఉప్పరపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆమె తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఖరీఫ్‌లో సాగుచేసిన పంట వివరాలు నమోదు చేసుకుని ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు. మట్టి నమూనా పరీక్షల ఫలితాల వివరాలను సంబంధిత రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో సిరికల్చర్ అధికారి ఓబులేసు, వ్యవసాయ విస్తరణ అధికారి మురళీకృష్ణ, గ్రామ ఉద్యాన శాఖ సహాయకులు విజయభాస్కర్, రైతు సేవ కేంద్రం సహాయకులు లక్ష్మీదేవి, ఎహెచ్ఎ శివ, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సలహాలు ఇస్తున్న వ్యవసాయ అధికారులు

తిరుపతి-కదిరిదేవరపల్లి రైలు పాక్షిక రద్దు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-రాయదుర్గం

కదిరిదేవరపల్లె నుంచి రాయదుర్గం మీదుగా తిరుపతికి ప్రయాణిస్తున్న రైలు (07589/ 07590)ను అక్టోబర్ 1 నుంచి నవంబర్ 1వ తేదీ వరకూ పాక్షిక రద్దు గడువును పొడిగించినట్లు నైరుతి రైల్వే చీఫ్ ప్యాసింజర్ ట్రాఫిక్ మేనేజర్ బిఎల్.శివకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం-కదిరిదేవరపల్లె మధ్య రైలు మార్గం మరమ్మతుల నేపథ్యంలో గుంతకల్లు-తిరుపతి మధ్య మాత్రమే ఈ రైలు నడుస్తుంది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ వసీం

వంద రూపాయల నిధులైనా తెచ్చారా..?

ఎమ్మెల్యే దగ్గుపాటికి నగర మేయర్ సూటి ప్రశ్న

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వైసిపి హయాంలో రూ. 1045 కోట్ల అభివృద్ధి జరిగితే ఈ వంద రోజుల్లో మీరు రూ. వంద నిధులైనా తీసుకొచ్చి అభివృద్ధి చేశారా? అని మేయర్ మహమ్మద్ వసీం ప్రశ్నించారు. నగరంలోని జిల్లా వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన కార్పొరేటర్లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరోనా సమయంలో వైసిపి పాలనలో రూ. 1.60 కోట్ల పాఠశాల నిర్మాణ నిధుల్లో అవినీతి జరిగిందని ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ఈ విషయంపై విచారణ జరిపించి వాస్తవం అని తేలితే అప్పుడు మాట్లాడాలని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కుటుంబం 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారని, వారి నిజాయితీ నిబద్ధత జిల్లా ప్రజలకు తెలుసు అన్నారు. మా పాలక వర్గం రూ. 13.80 కోట్లతో పలు పనులకు టెండర్లు పూర్తయినా ఎందుకు పనులు జరగడం లేదో, ఎన్నికల హామీలైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రింగ్ రోడ్డు, డంపింగ్ యార్డ్ తరలింపు, పరిశ్రమలు, తదితర వాటిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇకనైనా ఎమ్మెల్యే దగ్గుపాటి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని, నగర అభివృద్ధికి మా పాలకవర్గం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. వైసిపి మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ సైఫుల్లా బేగ్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీంపై నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, ఇషాక్, రహంతుల్లా, అనిల్ కుమార్ రెడ్డి, సంపంగి రామాంజనేయులు, నరసింహులు, నాయకులు కుళ్లాయి స్వామి, రామచంద్ర, కాకర్ల శీన తదితరులు పాల్గొన్నారు.

రథం కాల్చివేత ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలి : కాలవ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం : కణేకల్లు మండలంలోని హనకనహాల్‌లో రథం దహనం కేసులో హెడ్ కానిస్టేబుల్ రఘునాథ రెడ్డి ప్రమేయంపై దర్యాప్తు చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు జిల్లా ఎస్పీ జగదీష్‌కు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని తన నివాసంలో బుధవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లా డుతూ రథం దహనం సంఘటన జరిగిన ఒక్క రోజులోనే ప్రధాన నిందితుడు ఈశ్వరరెడ్డిని అరెస్టు చేయడాన్ని అభినందిం చారు. ప్రధాన నిందితుడు వైసిపి సానుభూతిపరుడి కావడంతో పాటు హెడ్ కానిస్టేబుల్ రఘునాథ్ రెడ్డికి బంధువు అవుతాడన్నారు. అనంతపురం నుంచి కేసు విచారణకు వచ్చిన పోలీసు బృందంలో రఘునాథరెడ్డి కూడా ఉండడం అనుమానాస్పదంగా ఉందన్నారు. అలాగే ఇది వరకూ వాలంటీర్‌గా పని చేసిన ఓ వ్యక్తి పాత్ర కూడా ఇందులో ఉన్నట్లు అనుమానం ఉందన్నారు. ఈ ఘటనపై నిష్పక్షిక దర్యాప్తు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జిల్లా ఎస్పీని కోరారు.

గ్రూపు తగాదాలను పార్టీలకు ఆపాదిస్తారా?

వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత

ప్రజాశక్తి -అనంతపురం

కణేకల్లు మండలంలోని హనకనహాల్ గ్రామంలో గ్రూపు తగాదాలతో జరిగిన ఓ ఘటనను రాజకీయ పార్టీలకు ఆపాదిస్తారా? అని వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. ఎస్పీ అధికార పార్టీకి ఊడిగం చేస్తారా? అని ప్రశ్నించారు. మత రాజకీయాలు చేస్తున్న కుట్రదారులకు ప్రజలే బుద్ధి చెప్పాలని కోరారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాముల వారి రథాన్ని దహనం చేయడం బాధాకరమని ఈ ఘటనను అందరూ ఖండించాల్సిందే అన్నారు. ఈ ఘటన గ్రూపు కక్షలతోనే జరిగిందన్నారు. విచారణ పూర్తి కాకుండానే ఎస్పీ ఒక పార్టీకి అంటకట్టడం సరికాదన్నారు. నిష్పక్షపాతంగా విచారణ చేసి దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఎస్పీని కోరారు. తిరుమల లడ్డూ విషయంలోనూ ఈఓ, చంద్రబాబు విరుద్ధ ప్రకటనలు చేశారని గుర్తు చేశారు. ఐఎఎస్, ఐపీస్‌లు వ్యవస్థలను కాపాడండి.. దిగజార్చవద్దు' అని హితవు పలికారు. తిరుమల పవిత్రతను, ప్రసాదం విశిష్టతను చంద్రబాబు అపవిత్రం చేశారని, చంద్రబాబు చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు ఈ నెల 28వ తేదీ జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

చెస్‌లో ఉదయ్‌కుమార్‌నాయుడు సత్తా

ప్రజాశక్తి-అనంతపురం



అమ్మినేని ఉదయ్ కుమార్ నాయుడుని అభినందిస్తున్న గ్రాండ్ మాస్టర్ తేజ్ కుమార్

బెంగళూరులోని లండన్ మాంటిస్సోరీ స్కూల్లో ఈ నెల 21వ తేదీ గ్రాండ్ మాస్టర్ తేజకుమార్ ఏకకాలంలో 30 మంది క్రీడాకారులతో సైమల్టేనియస్ చెస్ మ్యాచ్ ఆడారు. ఆ పోటీలో పాల్గొన్న 30 మంది క్రీడాకారుల్లో అనంతపురం నగరానికి చెందిన అమ్మినేని ఉదయ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు. గ్రాండ్ మాస్టర్ తేజ్ కుమార్ గారు 30 మంది క్రీడాకారులతో కూడా తెల్లపావులతో ఏక కాలంలో ఆట మొదలుపెట్టారు. అమ్మినేని ఉదయ్ కుమార్ నాయుడు తన ఆటను నల్లపావులతో ఆడాడు. సుమారు రెండు గంటలపాటు మ్యాచ్ జరగ్గా, 38 ఎత్తుల్లో ఆట నల్లపావులకు అనుగుణంగా మారింది. దీంతో గ్రాండ్ మాస్టర్ తేజ్ కుమార్ 39వ ఎత్తు దగ్గర(తెల్లపావులు) రిజైన్ చేయగా ఉదయ్ గెలుపొందారు. దీంతో అమ్మినేని ఉదయ్ కుమార్ నాయుడును గ్రాండ్ మాస్టర్ తేజ్ కుమార్, ఆర్గనైజర్ ఉత్కల్, తదితరులు అభినందించారు. అలాగే ఉదయ్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ గౌరవ ఛైర్మన్ బాలరాజు, అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి కిషోర్ నాయుడు ఆకాంక్షించారు.

2023 రబీ, ఖరీఫ్ పంట బీమా ప్రకటించాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-రాయదుర్గం



డిప్యూటీ తహశీల్దార్ రఘుకు వినతిపత్రం ఇస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

2023 రబి, ఖరీఫ్ పంట బీమా వెంటనే ప్రకటించాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణానాయక్, రమేష్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ రఘుకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గతేడాది రబి, ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించినా, కేంద్ర బృందాలు జిల్లాలో పర్యటించినా రైతులకు ఎలాంటి సాయం అందలేదన్నారు. అలాగే ఈ ఏడాది పంట పెట్టుబడి నిధి కింద ఎకరాకు రూ. 20 వేలు ఇవ్వాలని, వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడాన్ని విరమించుకోవాలన్నారు. మొత్తం 8 డిమాండ్లను ప్రభుత్వం వెంటనే ఆమోదించి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మధు, అంజి, రవి, నాగ, ఓబులేష్ పాల్గొన్నారు.

తిరుమల లడ్డూపై రాజకీయ విమర్శలు సరికాదు

ఉరవకొండ : తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై రాజకీయ విమర్శలు చేయడం దురదృష్టకరమని భారత చైతన్య యువజన(బిసివై)పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బెస్త పవన్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లడ్డూ ప్రసాదం తయారీలో గత ప్రభుత్వం నాణ్యతా ప్రమాణాలు పాటించకపో వడం, కల్తీ నెయ్యి సరఫరా చేసే వారికి టెండరు ఇవ్వడం దుర్మార్గమన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఇకపై తప్పులు జరగకుండా చర్యలు తీసుకుని భక్తులకు స్వచ్ఛమైన లడ్డూ ప్రసాదం అందజేయాలని కోరారు. ఈ నెల 27వ తేదీ పుంగనూరు నుంచి తిరుమలకు పాదయాత్ర చేస్తున్న బోడే రామచంద్ర యాదవ్ కు మద్దతుగా ఉరవకొండ ప్రాంతం నుంచి పది మంది పాదయాత్రలో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు

గుత్తి : ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా హెచ్చరించారు. పట్టణంలోని గాంధీ కూడలి నుంచి రాజీవ్ గాంధీ సర్కిల్ వరకూ బుధవారం మున్సిపల్ అధికారులు వివిధ దుకాణాల్లో సోదాలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఓ బేకరీలో ఉన్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని యజమానికి రూ. 5 వేలు జరిమానా విధించారు. రఘురాంరెడ్డి కాంప్లెక్స్‌లో ఉన్న కిరాణా దుకాణంలో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు స్వాధీనం చేసుకొని దుకాణదారునికి రూ. 10వేలు జరిమానా విధించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఎవరూ ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు ఉపయోగించరాదని సూచించారు. ప్రజలు సహకరించాలని కోరారు. తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాషా, హెల్త్ అసిస్టెంట్ నెట్టికల్లు, శానిటరీ కార్యదర్శులు పి.సురేష్ బాబు, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు



దుకాణంలో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

విద్యార్థులు శాస్త్రీయత వైపు అడుగులు వేయాలి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం



గుత్తిలో చెకుముకి ట్యాలెంట్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

విద్యార్థులు శాస్త్రీయత వైపు అడుగులు వేయాలని, నాగరికతకు శాస్త్రం ఎంతో తోడ్పడుతుందని జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్ చెన్నమల్లప్ప తెలిపారు. మండలంలోని వేపులపర్తి జడ్పీ హైస్కూల్ లో బుధవారం జెవివి ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విజ్ఞానం వైపు అడుగులు వేయాలన్నారు. చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను 50 పాఠశాలల్లో నిర్వహించగా మండల వ్యాప్తంగా 800 మంది రాశారన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం, సైన్స్ పరిజ్ఞానం పెంచుకుని మూఢ నమ్మకాల పై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. పాఠశాల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు అక్టోబర్ 1వ తేదీ మండల స్థాయిలో టెస్ట్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రోషన్‌బాషా, ఉపాధ్యాయులు సురేష్, పిఇటి నీలకంఠ, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గం : డి.హీరేహాల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించగా 160 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. హెచ్.సిద్దాపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గౌరీ శంకర్ మాట్లా డుతూ జెవివి నిర్వహిస్తున్న ఈ టెస్ట్‌లు విద్యార్థులకు సైన్స్ పట్ల అభిరుచి, నైపుణ్యాలు, సృజనాత్మక, విలువలు పెంపొందిస్తాయన్నారు. ప్రతిభను నిరూపించుకునేందుకు తోడ్పడతాయన్నారు. కార్యక్రమం లో జెవివి జిల్లా నాయకులు లక్ష్మీనారాయణ, తాలూకా నాయకులు జగదీష్, యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌బాబు, రామాంజనేయులు పర్యవేక్షణలో పరీక్షలు జరిగాయి.

గుత్తి : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు జెవివి రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎం.రంగన్న అన్నారు. మండలంలోని 30 పాఠశాలల్లో బుధవారం జెవివి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం పట్ల ఆసక్తి ఉండాలన్నారు. ప్రజలు మూఢనమ్మకాలను నమ్మరాదన్నారు. జెవివి 34 ఏళ్లగా ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు పి.వెంకటరామిరెడ్డి, మండల అధ్యక్షులు ఎ.రామాంజనేయులు, జిల్లా నాయకులు శ్రీధర్‌గౌడ్, దేశాయి నాగరాజు, గురుశంకర్, పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిపై అక్రమ కేసులు అమానుషం

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిపై దాడికి ప్రయత్నించడం, అక్రమ కేసులు బనాయించడం అమానుషమని శాసనమండలి ప్రివిలైజ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రాథమిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. దౌర్జన్యాలు, కక్ష సాధింపు చర్యల ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం మూర్ఖత్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్మవరంలో వైసిపి కార్యకర్తలపై టిడిపి కార్యకర్తలే దాడి చేసి, వైసిపి వారిపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. సబ్ జైలులో ఉన్న వైసిపి కార్యకర్తలను కేతిరెడ్డి పరామర్శించడానికి వెళ్లగా విధ్వంసక చర్యలకు పాల్పడటం శోచనీయమన్నారు. ఈ ఘటనలో పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం అమానుషమన్నారు. దౌర్జన్యాలు, అక్రమ కేసులు బనాయించడం వంటి వాటి ద్వారా ప్రజా కోర్టులో తప్పక శిక్షించబడతారని హెచ్చరించారు. ఆయనతో పాటు నాయకులు కాకర్ల నాగేశ్వరరావు, తిప్పారెడ్డి, రమణయాదవ్, రమణారెడ్డి, జయేంద్రరెడ్డి, శంకర్‌రెడ్డి, ఆమిద్యాల చెన్నబసన్నగౌడ్, శివలింగ, తిరుపాల్ యాదవ్, బోయ రాంబాబు, దిద్దేకుంట సూరి, మహాలింగ, రామచంద్ర, లాలెప్ప, గురుస్వామి, కేశన్న, ముస్తూరు, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఉరవకొండ



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న తహశీల్దార్ బాషా

పట్టణంలోని ఎస్కె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నియోజకవర్గ స్థాయి ఎపి స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్-17 క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. స్పోర్ట్స్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమానికి హెచ్‌ఎం మల్లికార్జున అధ్యక్షత వహించగా తహశీల్దార్ మహబూబ్ బాషా, ఎంఇఒ హెచ్.ఈశ్వరప్ప ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా తహశీల్దార్ పతాకాన్ని ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. నియోజక వర్గంలోని ఐదు మండలాల బాలబాలికలు 300 మంది పాల్గొన్నారు. వీరికి కార్యనిర్వా హకులు భోజనం, తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. ముందుగా 800 మీటర్ల పరుగు పందెంను తహశీల్దార్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం బాధ్యులు అక్కులప్ప, శ్రీనివాసులు, సత్యనారాయణ, కళ్యాణి, రాజశేఖర్, అయుక్కన్, కళా సుధాకర్, వ్యాయామ ఉపాధ్యా యులు నాగరాజు, ప్రభాకర్, మంజునాథ, రాఘవేంద్ర, శివ, రమేష్, చంద్ర, లక్ష్మి, లత, రుద్ర, అనిత, లత, బాలసంజయ్‌కుమార్, హరి, నాగేంద్ర, నియోజకవర్గ కోఆర్డినేటర్లు మారుతి ప్రసాద్, రాజేష్, నాయకులు గోపాల్, భాస్కర్, రాంబాబు, గోవిందు, రామాంజనేయులు, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ, పాల్గొన్నారు.

సీమను నిర్లక్ష్యం చేస్తున్న సిఎం చంద్రబాబు

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ


రాయలసీమ అభివృద్ధి చెందకుండా సిఎం చంద్రబాబు అడ్డుపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలులో ఏర్పాటు కావాల్సిన నేషనల్ లా యూనివర్సిటీ, కడప జిల్లా కొప్పర్తికి కేటాయించిన ఎంఎస్ఎంఈ టెక్నాలజీ కేంద్రాన్ని అమరావతికి తరలించడం శోచనీయమని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతా లు అభివృద్ధి చెందాలని జగన్ చేపట్టిన కార్యక్రమాలను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందన్నారు. వైద్య విద్యను ప్రయివేటీకరణ చేయడంపై యువజన విద్యార్థి సంఘాలు స్పందించాలన్నారు. సీమకు జరుగుతున్న అన్యాయంపై రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో వీరన్న, అశోక్ కుమార్, శివలింగ, ఎంపీటీసీలు సురేష్, వీరబొమ్మన్న, సర్పంచులు కేశవరెడ్డి, వంశీ, గోవిందరెడ్డి, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోండి

గార్లదిన్నె : ఆత్మహత్యకు పాల్పడిన రైతు సూర్యనారాయణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ ఈరమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ బాధిత రైతు కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆత్మహత్యకు కారణమైన వీఆర్వోను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతు కుటుంబానికి చెందిన భూమికి పట్టాదారు పాసుబుక్కు మంజూరు చేయాలని, మండలంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు రాయుడు, నల్లప్ప, నాగార్జునరెడ్డి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ ఈరమ్మకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు



పాతకొత్త చెరువు హైస్కూల్‌లో ఆందోళన చేస్తున్న :ఎస్ఎఫ్ఐ నాయకులు

పాతకొత్త చెరువు హైస్కూల్‌లో సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లు : మండలంలోని పాతకొత్త చెరువు గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇన్‌ఛార్జి హెచ్‌ఎంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం పాఠశాలను పరిశీలించారు. ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకీ మాట్లాడుతూ పాఠశాలలో కుళాయిలు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు సంపులో నీరు తాగుతున్నారన్నారు. మెనూలో ఉడికీ ఉడకని అన్నం, గుడ్డు పెడుతున్నారన్నారు. తక్షణం విద్యాశాఖ అధికారులు స్పందించి బాధ్యతా రహితంగా పనిచేస్తున్న ఇన్‌ఛార్జి హెచ్‌ఎంని సస్పెండ్ చేసి, రెగ్యులర్ హెచ్‌ఎం నియమించాలని, లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సమీర్, కేశవ్, సయ్యద్, సాయి, బాలాజీ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ



రాష్ట్రస్థాయి సమావేశాల పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

గుత్తి : విద్యా రంగంలో నెలకొన్న సమస్యల ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవా రం ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశాల కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. రమేష్ మాట్లాడుతూ బాలికల కళాశాల వద్ద ఉన్న బిసి బాలికల సంక్షేమ వసతి గృహంలో గదుల కొరతతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అదనపు గదులు నిర్మించాలన్నారు. అక్టోబర్ 5 నుంచి 8వ తేదీ వరకూ అనంతపురం నగరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశాలకు రాష్ట్ర నలుమూలల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాలు, నవీన్ యాదవ్, ధను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'ఉపాధి' పనులు చేపట్టాలి

పుట్లూరు : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని ఎంపీడీవో యోగానందరెడ్డి టిఎలను ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలన్నారు. అలాగే మొక్కలు నాటాలని టిఎలకు సూచించారు. సమావేశంలో ఎపిఒ కేశవులు, టిఎలు, బీఎఫ్టీలు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేస్తాం : ఎమ్మెల్యే



చిరు వ్యాపారులకు తోపుడుబండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం : చిరు వ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తెలిపారు. ఎమ్మెల్యే బుధవారం ప్రజావేదిక వద్ద రూ. 2 లక్షల విలువ చేసే పది తోపుడుబండ్లను చిరు వ్యాపారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తోపుడు బండ్లు ఉచితంగా ఇస్తే వాటి విలువ తెలియదన్నారు. ఒక్కో బండి రూ. 20వేలు అని ఆ డబ్బును వడ్డీ లేకుండా నెలసరి చెల్లిస్తే భవిష్యత్తు లో ఆ డబ్బుకు రెట్టింపు చేసి మీ అభివృద్ధికి అందజేస్తానని హామీ ఇచ్చారు. పిల్లలను బాగా చదివిస్తూ, కుటుంబ భవిష్యత్తు కోసం వ్యాపారాలను సాగిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ బిక్కి రామలక్ష్మి, మాజీ కౌన్సిలర్లు అమర బిందు, రాజశేఖర్, లక్ష్మీనారాయణ, గోళ్ల సర్పంచి కవితా బుజ్జి, అన్న వెంకటేశులు, శివన్న, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శింగనమల : శింగనమల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్త, మినీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ ఉమాశంకరమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానికులై పదో తరగతి పాసై ఉండి జూలై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 ఏళ్ల లోపు మహిళలు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో 21 ఏళ్లు నిండిన వారు లేనిచో 18 ఏళ్లు నిండిన వారే అర్హుల న్నారు. ఖాళీల వివరాలు.. గాంధీనగర్ మినీ అంగన్వాడీ వర్కర్ బిసి-బి, శింగనమల-2 అంగన్వాడీ హెల్పర్ బిసి-డి, గోవిందరాజపేట అంగన్వాడీ హెల్పర్ ఓసి, కల్లూరు-3 అంగన్వాడీ హెల్పర్ ఎస్సీ, కల్లూరు-4 అంగన్వాడీ హెల్పర్ బిసి-డి, రాఘవేంద్ర కాలనీ అంగన్వాడీ హెల్పర్ ఓసికి కేటాయించినట్లు సిడిపిఒ తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి చేయిచేయి కలపాలి : ఎమ్మెల్యే

గుంతకల్లు రూరల్ : చేయి చేయి కలిపి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలే కానీ ఎక్కడా కక్షలు, కార్పణ్యాలకు తావివ్వరాదని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ పిలుపునిచ్చారు. ఆర్‌డిఒ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని నాగసముద్రం గ్రామంలో నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం లో ఎమ్మెల్యే పాల్గొని ఉద్వేగ భరితంగా ప్రసంగించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేస్తామన్నారు. అలాగే డబుల్ వే రోడ్డు, హంద్రీనీవా ద్వారా సాగునీరు, నాగసముద్రం-వెంకటంపల్లి బ్రిడ్జి నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, తాసిల్దార్ రమాదేవి, ఎంపీపీ వాల్మీకి మాధవి, ఇతర మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయించండి : ఎంపిడిఒ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ దివాకర్

నార్పల : మండల వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న గృహాల నిర్మాణాలను పూర్తి చేయించాలని ఎంపిడిఒ దివాకర్, తహశీల్దార్ అరుణకుమారి ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం మండల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. ఎంపిడిఒ, తహశీల్దార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 342 గృహాలు మంజూరయ్యాయని, అందులో 124 గృహ నిర్మాణాలు పూర్తి కాగా మిగిలి అసంపూర్తిగా ఉన్న గృహాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గ్రామాల వారీగా సర్వే చేసి వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మండలంలోని అన్ని పంచాయతీల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ కౌన్సిలర్ మృతి

గుత్తి : గుత్తి ఆర్ఎస్‌కు చెందిన టిడిపి నాయకుడు, మాజీ కౌన్సిలర్ సురేష్‌బాబు(45) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. తెల్లవారుజామున సురేష్ బాబుకు ఛాతిలో నొప్పి రావడంతో హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలిసిన వెంటనే టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వెంకటశివుడు యాదవ్, మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణ, పట్టణ అధ్యక్షుడు ఎంకె.చౌదరి సురేష్ బాబు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు మోడే శ్రీనివాస్‌యాదవ్, దిల్‌కా శీన, లక్ష్మణ్‌చౌదరి, సాల్మన్‌రాజ్, ఎన్.సుధాకర్ నాయుడు, నంద్యాల రమేష్, చికెన్ శీన, ఎం.నాగరాజు, బి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పదో డివిజన్‌లో 'ఇది మంచి ప్రభుత్వం'

అనంతపురం : నగరంలోని పదో డివిజన్ 15వ సచివాలయంలో బుధవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పద్మశాలి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ మెంబర్ పోతుల లక్ష్మి నరసింహులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సిఎం చంద్రబాబు ఎన్నికల హామీలను దశల వారీగా నెరవేరుస్తూ ముందుకు వెళ్తున్నారని తెలిపారు. అన్న క్యాంటీన్లను ప్రారంభించి పేదల ఆకలి తీరుస్తున్నారన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించారన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తారన్నారు. కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకురాలు కంటాదేవి, రమాదేవి, ఆది, విజ్జి, సరస్వతి, అర్చన, లడ్డు, పోతుల మంజునాథ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

కళ్యాణదుర్గం : యువతకు ఎయిడ్స్‌పై తప్పనిసరిగా అవగాహన ఉండాలని క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్ సూచించారు. స్థానిక ఎస్‌విజిఎం డిగ్రీ కళాశాలలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, రిడ్స్ కళ్యాణదుర్గం స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి ఎయిడ్స్ వల్ల కలిగే నష్టాలపై నిరక్షరాస్యులకు వ్యాధి సంక్రమణ, లక్షణాలు, నివారణ మార్గాలు, మందుల గురించి వివరించాలన్నారు. వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపవద్దన్నారు. క్షయ, సుఖ వ్యాధులు సోకే విధానాలను తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శైలజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్, డాక్టర్ రవిశంకర్, మురళీమోహన్, మహేష్, కిరణ్, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

గుత్తి : పట్టణంలోని తురకపల్లి రోడ్డులో బుధవారం రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాలు.. మండలంలోని అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన గోపాల్‌గౌడ్ (50), భార్య సుమలత ఐదేళ్ల క్రితం విడిపోయారు. కుమారుల పిలుపు మేరకు సుమలత మూడు రోజుల క్రితం తమ అత్తను చూడడానికి అబ్బేదొడ్డి గ్రామానికి వచ్చింది. విషయం తెలుసుకున్న గోపాల్ గౌడ్ సుమలతతో గొడవపడి ఆమెపై చేయి చేసుకోవడంతో కింద పడిన ఆమె తీవ్రంగా గాయపడి కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమలతకు ఏమవుతుందోనని భయపడ్డ గోపాల్ గౌడ్ తురకపల్లి గ్రామ సమీపంలో రైలు కింద పడ్డాడు. అతడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



ఆత్మకూరు మండలం పి.యాలేరు గ్రామంలో..


బెలుగుప్ప మండలం కోనాపురం గ్రామంలో..


బ్రహ్మసముద్రం మండలం తీటకల్లు, బొమ్మగానిపల్లి గ్రామాల్లో..

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-పామిడి

మండలంలోని వంకరాజుకాలువ, నెమల్లపల్లి గ్రామాల్లో బుధవారం ఏవో లీలావసుంధర ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులకు తెలిపారు. అలాగే ఏ పంటకు ఏ మందులు వాడాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరావు, శ్రీకాంత్, అబ్దుల్‌వలి, రైతులు సుబ్రహ్మణ్యం, నబి రసూల్, బాబు, రామన్న, చెన్నకేశవులు, శ్రీనివాస్, కష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని తీటకల్లు, బొమ్మగానిపల్లి గ్రామ పొలాల్లో ఏవో సరిత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు తమ వ్యవసాయ పొలంలో పొలంబడి నిర్వహించారు. ఆమె వివిధ పంటలకు తెగుళ్లు, పురుగుల నివారణ, సేంద్రియ ఎరువులు, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ సాగు కింద 9,675 మంది రైతులకు 35,550 ఎకరాల్లో పంట నమోదు చేశామన్నారు. 7,543 మంది రైతులకు సంబంధించి 28,141 ఎకరాల్లో ఈకేవైసీ పూర్తయిందన్నారు. మిగిలిన 2130 మంది రైతుల ఈ కేవైసీ గురువారం లోపు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నార్పల : 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని చామలూరు, కేశేపల్లి గ్రామాల్లో పర్యటించినట్లు ఏవో చెన్నవీరస్వామి తెలిపారు. వరి పంటలో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగు పంట ఎదుగుదల, దిగుబడి, తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాము, గ్రామ వ్యవసాయ అధికారులు, మార్కెటింగ్ డిపార్ట్మెంట్‌కు సంబంధించిన సుశీలు, కేశేపల్లి పంచాయతీ సెక్రెటరీ వరలక్ష్మి, రైతులు పాల్గొన్నారు

ఆత్మకూరు : మండలంలోని పి.యాలేరు గ్రామంలో బుధవారం ఏవో సుచరిత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులకు వ్యవసాయ పద్ధతులు, పురుగు నివారణ చర్యలు, పంట సస్యరక్షణ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఇఒ సుజిత, రైతులు పాల్గొన్నారు.

శింగనమల : సేంద్రియ ఎరువులతో అధిక దిగబడి సాధించవచ్చని ఏవో ఎన్.అన్వేష్ కుమార్ తెలిపారు. మండలంలోని రాచేపల్లి, ఆనందరావుపేట గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏవో రైతులు సాగు చేసిన పంటలపై చర్చించారు. అధిక దిగుబడి, తెగుళ్లు, నివారణ మార్గాలు, ఎరువులు, తదితర అంశాలపై సూచనలు ఇచ్చారు. ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి అక్కమ్మ, రాచేపల్లి రైతు సేవాకేంద్రం ఎంపిఇఒ జయలక్ష్మి, మార్కెట్ యార్డ్ సిబ్బంది మహేష్ పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండలంలోని కోనాపురం గ్రామంలో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో దూడలకు బూస్టర్ దోస్ టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నియంత్రణలో భాగంగా గత నెలలో టీకాలు వేసిన దూడలకు ఇప్పుడు బూస్టర్ డోస్ టీకా వేశామన్నారు. రైతులు దూడలకు ఈ టీకా వేయించుకోవాలని సూచించారు. నట్టల నివారణ మందు తాపించారు. అనంతరం పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి కృష్ణతేజ, ఏవో పృథ్వీసాగర్, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'

కోనాపురం గ్రామంలో చేపట్టిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో వ్యవసాయ, అనుబంధ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఏవో పృథ్వీసాగర్ పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. పశు వైద్య అధికారి రమేష్ పశువులు, గొర్రెలకు సకాలంలో టీకాలు వేయించాలని సూచించారు. ఉద్యాన అధికారి కృష్ణతేజ పథకాలు, రాయితీలను తెలిపారు. మల్లేష్ సబ్సిడీపై అందించే డ్రిప్, స్ప్రింక్లర్ గురించి తెలిపారు. అనంతరం వివిధ పంటలను పొలాలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. వారితో పాటు అగ్రికల్చర్, వెటర్నరీ అసిస్టెంట్లు హనుమంతరాయుడు, సుదర్శన్, నాయకులు ప్రతాప్, పురుషోత్తం, జయరాములు, ధనుంజయ, లక్ష్మీనారాయణ, రైతులు, గొర్రెల కాపరులు ఉన్నారు.

నార్పలలో గ్రామసభ

నార్పల : స్థానిక మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచి మనీల సుప్రియ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు మండల ప్రత్యేకాధికారి రామసుబ్బారెడ్డి, ఎంపీడీవో దివాకర్ హాజరై 2047 వికసిత్ భారత్ లక్ష్యాలను వివరించారు. పంచాయతీ పరిధిలో ఏవైనా సమస్య లుంటే వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఉద్యోగులను ఆదేశించారు. అలాగే నిర్మాణాలు, చేపట్టాల్సిన పనులపై అధికారులు తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డి శైలజరాణి, పంచాయతీ కార్యదర్శులు చరణ్, పరశురాం, శ్రీనివాసులు, లక్ష్మేంద్ర, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాతలు పారిశుధ్య కార్మికులు

పామిడి : పారిశుధ్య కార్మికులు ప్రజారోగ్య ప్రదాతలని పంచాయతీ జూనియర్ అసిస్టెంట్లు ఖాజామొయిద్దీన్, అబ్దుల్ హుస్సేన్ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. మేస్త్రీ నాగరాజు మాట్లాడుతూ కార్మికులు పనుల్లో పాల్గొంటున్నప్పుడు తప్పనిసరిగా మాస్కు ధరించాలని, చేతికి బ్లౌజులు వేసుకోవాలన్నారు. పంచాయతీ వెల్ఫేర్ సెక్రటరీ నాగరాజు మాట్లాడుతూ కరోనా సమయంలో అత్యంత విలువైన సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో రఘు, రమణ, విజయ్, వేణు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

శింగనమల : మండలంలోని శోధనపల్లె గ్రామ ఎస్సీ కాలనీలో ఉన్న ఎంపిపి స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న ముబీనా ఈ నెల 5వ తేదీ జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. దీంతో బుధవారం పాఠశాలలో ఎంఇఒ నరసింహరాజు, శివప్రసాద్ ఆమెను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయురాలు ముబీనా మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలకు అనుణంగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చితీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మధు, పుట్లూరు మండల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-బెలుగుప్ప

మండలంలోని ఎర్రగుడి గ్రామ సచివాలయంలో బుధవారం ఉద్యోగులతో కలిసి జనసేన మండల అధ్యక్షులు కాశంశెట్టి సుధీర్, బిజెపి మండల అధ్యక్షులు వన్నూరుస్వామి తదితరులు మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ మెక్కలు నాటి సంరక్షించడం వల్ల మానవాళికి ఎంతో ప్రయోజనకరం అన్నారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అలాగే సదుపాయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో బిజెవైఎం మండల అధ్యక్షులు పూజారి మధు, ఫీల్డ్ అసిస్టెంట్ అశోక్, టిడిపి నాయకులు రాజన్న, రఘురాములు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ వితరణ

అనంతపురం రూరల్

అనంతపురం అర్బన ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం మున్సిపల్ ఎస్సీ అసోసియేషన్‌కు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్, ఎంపి అంబికా లక్ష్మినారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు చేత కంప్యూటర్‌ను అందజేశారు.

పొలాలకు వెళ్లే దారి మూసివేత

రైతులు, ప్లాట్ల యజమానుల ధర్నా


నిరసన తెలుపుతున్న రైతులు, ప్లాట్ల యజమానులు

ప్రజాశక్తి-గుత్తి

గుత్తిఆర్ఎస్ రోడ్డులో ఉన్న సాయి డిగ్రీ కళాశాల సమీపంలో తమ పంట పొలాలు, ప్లాట్లకు వెళ్లే దారిని కొందరు మూసివేయడంపై రైతులు, ప్లాట్ల యజమానులు బుధవారం ధర్నా చేశారు. పొలాలకు వెళ్లే దారిని మూసివేసి నిర్మిస్తున్న హోటల్ ఎదుట ఆందోళన చేపట్టారు. పంట పంట పొలాలు, ప్లాట్లకు వెళ్లే దారిని వెంటనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ప్లాట్ల యజమానులు గోవిందు, రమణ, తిరుమలేశు, ప్రసాద్, నాగయ్య, ఖాజా, బిఆర్ ప్రసాద్, జాఫర్, మనోహర్‌రెడ్డి, ఆకుల అబ్దుల్, మజీద్ సాబ్, రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలలో ముళ్లపొదలు తొలగింపు

ప్రజాశక్తి-శింగనమల

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని చిన్న జలాలపురం హైస్కూల్‌లో జెసిబితో ముళ్లపొదలు తొలగించారు. అలాగే గ్రామంలో రోడ్లకి ఇరువైపులా శుభ్రం చేశారు. ఆ పనులను సర్పంచి వెంకటరాముడు, టిడిపి నాయకులు పట్నం నగేష్, సుధాకర్ పర్యవేక్షించారు.

దశభుజ మహాగణపతి ఆలయ నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ఆత్మకూరు వీధిలో ఉన్న దశ భుజ మహాగణపతి ఆలయానికి బుధవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా వై.వెంకటేశులు, తాయి రాజశేఖర్, అధ్యక్షులుగా బిటి.వెంకటేశులు, ఉపాధ్యక్షులుగా హర్షవర్ధన్, కార్యదర్శిగా బండి సుధాకర్, సంయుక్త కార్యదర్శిగా వినాయక, కోశాధికారిగా నాగేంద్రప్రసాద్, ఉప కోశాధికారిగా ఎర్రిస్వామి, కార్యవర్గ సభ్యులుగా హరికృష్ణారావు, ప్రశాంతి, కృష్ణ, శ్రీరామిరెడ్డి, కపిల్, పృథ్వీ, మంజునాథ, నవీన్, హర్ష, ప్రకాష్, తిప్పేస్వామిలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఆలయ హుండీని తెరవలేదని, తాము తెరిచి లెక్కించగా రూ. 8,32,590 ఉన్నట్లు వెల్లడైందన్నారు. ఆలయ ఆవరణలోని నరసింహస్వామి ఆలయ గర్భగుడిపై గోపురం, కలశం ఏర్పాటు చేస్తామని, దశభుజ గణపతి మందిరం ఎదురుగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తామని తెలిపారు. ఆలయ ఆవరణలో ఇతర అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.

తహశీల్దార్ కార్యాలయం కోసం భవనం పరిశీలన

ప్రజాశక్తి-బెలుగుప్ప

ప్రస్తుతం తహశీల్దార్ కార్యాలయం ఇరుకు గదుల్లో నిర్వహిస్తుండడంతో అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండలల టిడిపి నాయకులు మల్లికార్జున, పెద్ద తిప్పయ్య కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం తహశీల్దార్ షర్మిల పాత ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. అందులో తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు నివేదిక తయారుచేసి కలెక్టర్‌కు పంపిస్తామని తెలిపారు. ఆమె వెంట టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, జిల్లా ఉపాధ్యక్షులు పెద్ద తిప్పయ్య, డిప్యూటీ తహశీల్దార్ హుస్సేన్‌పీరా, ఆర్ఐ నగేష్ బాబు, సూపర్వైజర్ వెంకటరమణ, వీఆర్వో ఎర్రిస్వామి ఉన్నారు.

స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై అవగాహన సదస్సు

పుట్లూరు : మండలంలోని కందికాపుల గ్రామంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌కు సంబంధించి బుధవారం ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. అలాగే తక్కల్లపల్లి, కోమటికుంట్ల చెర్లోపల్లి, తదితర గ్రామాల్లో గ్రామసభ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలు సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఆంజనేయులు, సర్పంచి శివరామయ్య, తహశీల్దార్ శేషారెడ్డి, సహాయ గణాంక అధికారి విజయకుమార్, డిఆర్‌డిఎ ఎపిఎం వెంకట్రామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

నగరంలోని రెవెన్యూ భవన్‌లో బుధవారం 'పోషణ్ మా 2024- పౌష్టికాహార మాసోత్సవాలు' నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ 'పౌష్టికాహార మాసోత్సవాలు' కార్యక్రమంలో భాగంగా పోషకాహారంపై నెల రోజుల పాటు ఉద్యమంలా విస్తృత ప్రచారం నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ప్రతి బిడ్డ, తల్లి, కుటుంబం ఆరోగ్యకరంగా ఉండేలా అడుగులు వేయడానికి ప్రతి ఒక్కరు చేయి చేయి కలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపి అంబికా లక్ష్మినారాయణ, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్, జిల్లా అసిస్టెంట్ కలెక్టర్, డిఎంహెచ్ఒ, జిల్లా మహిళాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

రాయితీపై ఉలవలు, పెసలు పంపిణీ

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలో బుధవారం రాయితీపై రైతులకు పెసలు, ఉలవల విత్తనాలను సచివాలయం అధికారులతో కలిసి టిడిపి నాయకులు గొంచికారి శివారెడ్డి పంపిణీ చేశారు. శివారెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రైతులు, రైతుకూలీలను నట్టేట ముంచిందని, సిఎం చంద్రబాబు రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలను పంపిణీ సరైన సమయంలో సరైన విధంగా ప్రభుత్వం అందించడం శుభ పరిణామం అన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్, సచివాలయ ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.